జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శనివారం | 18-07-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 731 పేజీలు: 4 వెల: రూ.7

## పోలీసులకు కాక రేపిన..
# హిట్ అండ్ రన్!

**✳ మాజీ మంత్రి కుమారుడికి 14 రోజుల రిమాండ్ ✳ కాశీబుగ్గ ఎస్ఐపై వేటు.. మరికొందరిపై నిఘా ✳ ఖాకీల 'కాల్ డేటా' గుట్టురట్టు ✳ రెండేళ్ల హిస్టరీపై ఆరా! ✳ తెరపైకి పాతపట్నం ఎమ్మెల్యే తనయుడి నాటి ఉదంతం ✳ ప్రతిపక్షాల ఎదురుదాడి ✳ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో విశాఖ రేంజ్ డీఐజీ సుదీర్ఘ సమీక్ష**



శ్రీకాకుళం క్రైం, జులై 17 (వార్త): రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన కాశీబుగ్గ 'బైక్ ప్రమాదం' (హిట్ అండ్ రన్) కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. ప్రమాదానికి కారకుడైన మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడు ఆరవ్ వర్మకు కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో ఈ వ్యవహారం మరింత ముదిరింది. కేవలం నిందితుడి అరెస్ట్‌తోనే ఈ ఉదంతం సద్దుమణగడం లేదు. అసలు నిందితుడిని తప్పించి, కేసును పక్కదారి పట్టించేందుకు తెరవెనుక సహకరించిన ఖాకీల గుట్టు తేల్చేందుకు ఉన్నతాధికారులు రంగంలోకి దిగారు. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం విశాఖ రేంజ్ డీఐజీ జిల్లా కేంద్రానికి చేరుకుని పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన అత్యవసర సమీక్షా సమావేశం తీవ్ర ఉత్కంఠ రేపింది.

### కాల్ డేటా గుట్టు రట్టు.. రెండేళ్ల హిస్టరీపై ఆరా!

ఈ వ్యవహారంలో పాలుపంచుకున్న ఖాకీల ఆట కట్టించేందుకు ఉన్నతాధికారులు సాంకేతిక ఆధారాలపై దృష్టి పెట్టారు. వి.ఆర్.కు వెళ్లిన కాశీబుగ్గ ఎస్ఐ ఎం.సునీల్‌తో పాటు సదరు పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న మిగిలిన సిబ్బంది మొబైల్ ఫోన్ల కాల్ రికార్డులను (సిడిఆర్) ఉన్నతాధికారులు కూలంకషంగా పరిశీలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ప్రమాదం జరిగిన రాత్రి ఎస్ఐ, సిబ్బంది ఎవరెవరితో మాట్లాడారు? ఎవరి నుంచి ఫోన్ కాల్స్ వచ్చాయి? అనే కోణంలో లోతుగా విచారణ జరుపుతున్నారు. కేవలం ఆ రాత్రి కాల్స్ మాత్రమే కాకుండా, సదరు పోలీసు సిబ్బంది గత రెండేళ్లుగా ప్రతిపక్షంలోని ఎవరెవరితో టచ్‌లో ఉన్నారు? రాజకీయ వర్గాలతో ఎలాంటి సంబంధాలు నడిపారనే విషయాలపై కూడా ఆరా తీస్తుండటం శాఖలో గుబులు రేపుతోంది. ఎందుకంటే ఇదే విషయమై స్థానిక ఎమ్మెల్యే హోంమంత్రికి ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. దీంతో ప్రభుత్వానికి తీవ్రస్థాయిలో చెడ్డపేరు తీసుకురావడానికి కారణమైన ఏ ఒక్కరినీ వదిలిపెట్టకూడదనే ఉద్దేశంతోనే ఈ తరహా కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నట్లు భోగట్టా.



### నాటి పాతపట్నం కేసుతో ప్రతిపక్షాల కౌంటర్!

ప్రస్తుత అధికార పక్షం ఈ వ్యవహారంలో రాజకీయ లబ్ధి కోసం చూస్తోందంటూ విపక్షాలు గట్టిగా తిప్పికొడుతున్నాయి. సరిగ్గా రెండేళ్ల క్రితం (2024లో) పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తనయుడు కూడా సరిగ్గా ఇలాంటి రోడ్డు ప్రమాదానికే కారణమయ్యారని, అప్పట్లోనూ సాక్ష్యాధారాలను అడ్డగోలుగా తారుమారు చేసి కేసును పూర్తిగా నీరుగార్చారని ప్రతిపక్ష నేతలు గుర్తుచేస్తున్నారు. "అధికార పక్ష నేతలకు ఒక న్యాయం.. ప్రతిపక్ష నేతలకు మరో న్యాయమా?" అంటూ ఖాకీల పక్షపాత వైఖరిని ఎండగడుతున్నారు. నాటి కేసులో సూత్రధారులను వదిలేసి, నేడు తమ నాయకుడి కుటుంబంపై కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారంటూ మండిపడుతుండటంతో ఈ ఉదంతం కాస్తా తీవ్ర రాజకీయ రంగు పులుముకుంది. దీంతో నాటి కేసుపై పాతపట్నం శాసనసభ్యులు మామిడి గోవిందరావు మాట్లాడాల్సిన పరిస్థితి నెలకొంది. కారుతో ఆటోను గుద్దేసి అందులో ఒకరి మరణానికి కారణమయ్యారని పాతపట్నం ఎమ్మెల్యే గోవిందరావు కుమారుడిపై ఆరోపణలు ఉన్నాయి. అయితే కార్లో ప్రయాణిస్తున్న స్నేహితుడు డ్రైవింగ్ చేస్తున్నట్లు అప్పటికప్పుడు సీను మార్చేశారని ఆరోపణలు ఉన్నాయి.

### శాఖాపరమైన చర్యల పర్వం..

పలాస సమీపంలో జరిగిన ప్రమాదం తొలినాళ్లలో నిందితుడిని కాపాడేందుకు స్థానిక పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారనే ఆరోపణలు నిజమేనని ప్రాథమిక దర్యాప్తులో తేలింది. తప్పుడు నిందితుడిని సృష్టించి, స్టేషన్ బెయిల్‌పై పంపేలా చక్రం తిప్పిన కాశీబుగ్గ ఎస్ఐ ఎం.సునీల్‌ను వి.ఆర్.కు (వేకెన్సీ రిజర్వ్) పంపుతూ జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేశారు. అయితే, ఈ వ్యవహారంలో కేవలం ఎస్ఐ పాత్రే కాకుండా, కాశీబుగ్గ సర్కిల్ పరిధిలోని మరికొందరు ఉన్నతాధికారుల హస్తం కూడా ఉందనే గట్టి అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పొలిటికల్ ప్రెషర్‌కు లొంగి కేసును నీరుగార్చాలని చూసిన సదరు అధికారుల జాబితాను కూడా ఉన్నతాధికారులు సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.

### డీఐజీ సుదీర్ఘ సమీక్ష.. ఏం జరిగింది?

కేసు రాష్ట్రస్థాయిలో ప్రాధాన్యత సంతరించుకోవడంతో విశాఖ రేంజ్ డీఐజీ గురువారం సాయంత్రం శ్రీకాకుళం జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చారు. జిల్లా ఎస్పీ, దర్యాప్తు అధికారులతో అర్ధరాత్రి వరకు సుదీర్ఘంగా సమీక్ష జరిపారు. ప్రమాదం జరిగిన రాత్రి నుంచి నిందితుడు లొంగిపోయే వరకు పోలీస్ స్టేషన్‌లో ఏం జరిగింది? ఎవరెవరు ఒత్తిడి తెచ్చారు? సీసీటీవీ ఫుటేజీలు బయటకు రాకుండా ఎందుకు దాచారు? అనే అంశాలపై డీఐజీ ఆరా తీసినట్లు సమాచారం.

### కఠిన చర్యలకు ఆదేశం..

చట్టం ముందు ఎవరైనా ఒక్కటేనని, తప్పు చేసిన వారు ఎంతటి వారైనా వదిలిపెట్టేది లేదని డీఐజీ స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. శాఖకు మచ్చ తెచ్చేలా వ్యవహరించిన మిగిలిన పోలీసు అధికారులపై కూడా త్వరలోనే శాఖాపరమైన కఠిన చర్యలు ఉంటాయనే సంకేతాలు ఇచ్చారు. పరువు పోయిన కేసులో డిపార్ట్‌మెంట్ ఇమేజ్‌ను తిరిగి కాపాడుకునేందుకు ఉన్నతాధికారులు గట్టి కసరత్తే చేస్తున్నారు. మరికొద్ది రోజుల్లో పలాస-కాశీబుగ్గ పోలీస్ సర్కిల్‌లో మరికొన్ని వికెట్లు పడటం ఖాయమనే చర్చ పోలీస్ వర్గాల్లో జోరుగా సాగుతోంది.

---

## కలెక్టర్ క్యాంపు ఆఫీస్ వెనుకే..
# ఇసుక కొల్లగొట్టుడు!

**✳ విజయవాడ పెద్దల అండతో విధ్వంసం ✳ 'తోటపాలెం' పేరుతో 'దమ్మలవీధి' దోపిడీ ✳ రికార్డుల్లో అబద్ధాలు.. నదిలో వాస్తవాలు! ✳ సస్పెన్షన్ వేటు పడకుండా వీఆర్వో పొలిటికల్ మేనేజ్‌మెంట్.. ✳ మైన్స్ శాఖ నిస్సిగ్గు నిర్లక్ష్యం బయటపెట్టిన జాబితా లీక్ ✳ కాగితాల్లో 'ఐదు వేలు'.. నదిలో మొత్తం ఖాళీ! ✳ తోటపాలెం' లెక్కల్లో మైన్స్ శాఖ మాయాజాలం.. ✳ క్షేత్రస్థాయిలో యథేచ్ఛగా దోపిడీని బంధనలు ఉల్లంఘించి 'దమ్మలవీధి' వైపు తవ్వకాలు.. ✳ స్థానికులు అడ్డుకున్నా 'విజయవాడ' లాబీయింగ్‌తోనే సాగుతున్న దందా! ✳ ఆదేశాలున్నా ఆగని సస్పెన్షన్.. ✳ వీఆర్వోను కాపాడిన రాజకీయ ఒత్తిళ్లు**

**శ్రీకాకుళం, జులై 17 (వార్త):** జిల్లా పరిపాలనాధికారి నివాసముండే కలెక్టర్ క్యాంప్ ఆఫీస్ ముక్కు కిందనే పర్యావరణ చట్టాలు నవ్వులపాలవుతున్నాయి. విజయవాడ కేంద్రంగా నడుస్తున్న అత్యున్నత స్థాయి రాజకీయ లాబీయింగ్ అండ చూసుకుని, నిబంధనలను తుంగలో తొక్కి ఇసుక అసురులు నదీ గర్భాన్ని తోడేస్తున్నారు. సామాన్య జనం, స్థానిక ఎమ్మెల్యేలు గొంతు చించుకుంటున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. మైన్స్ అండ్ జియోలాజి శాఖ అధికారుల చేతులు నలిగాయో, లేక రాజకీయ ఒత్తిళ్లకు మోకరిల్లారో కానీ, రికార్డుల్లో చూపిస్తున్న లెక్కలకు క్షేత్రస్థాయిలో జరుగుతున్న దోపిడీకి అస్సలు పొంతనే లేదు. జిల్లాలో ఇసుక అక్రమ తవ్వకాలపై గనుల శాఖ ప్రదర్శిస్తున్న నిర్లక్ష్యం, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గుతున్న తీరు పరాకాష్టకు చేరింది. సాక్షాత్తూ కలెక్టర్ క్యాంప్ ఆఫీస్ వెనుక భాగంలో జరుగుతున్న పర్యావరణ విధ్వంసానికి సంబంధించిన అధికారిక పత్రాలను పరిశీలిస్తే ఆ శాఖ ఎంతటి 'మాయాజాలానికి' తెరతీసిందో స్పష్టమవుతోంది. అధికారిక లెక్కల్లో చూపించే క్వాంటిటీకి.. క్షేత్రస్థాయిలో తరలిపోతున్న ఇసుకకు పొంతనే లేకుండా పోయింది. ప్రభుత్వ రికార్డుల ప్రకారం.. తోటపాలెం డీ-సిల్టేషన్ పాయింట్ వద్ద అనుమతించిన మొత్తం క్వాంటిటీ 1,10,250 క్యూబిక్ మీటర్లు కాగా, ఇప్పటివరకు కేవలం 5,000 క్యూబిక్ మీటర్లలి మాత్రమే డిస్పాచ్ (తవ్వినట్టు) చేసినట్లు మైన్స్ శాఖ లెక్కలు చెబుతున్నాయి. కానీ వాస్తవానికి అక్కడ అనుమతించిన క్వాంటిటీ ఎప్పుడో పూర్తిగా తవ్వేసి, ఖాళీ చేసేశారు. మూడు భారీ ప్రొక్లెయిన్లతో రాత్రింబవళ్లు వందలాది లారీల ద్వారా ఇసుకను విశాఖకు తరలిస్తూ, రికార్డుల్లో మాత్రం కేవలం ఐదు వేల క్వాంటిటీ మాత్రమే చూపించడం వెనుక మైన్స్ అధికారుల హస్తం ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చు. నిబంధనల ప్రకారం కేవలం తోటపాలెం పరిధిలో మాత్రమే తవ్వకాలు జరపాల్సి ఉంది. అయితే ఆ ప్రాంతంలో ఇసుక ఎప్పుడో అయిపోవడంతో, అక్రమార్కులు ఏకంగా నదికి మరోవైపు ఉన్న లిదమ్మలవీధిలి తీరం వైపునకు చొరబడ్డారు. యంత్రాలు పెట్టి అడ్డగోలుగా తవ్వకాలు జరుపుతుండటంతో భూగర్భ జలాలు దెబ్బతింటాయని, ఇళ్లు కుంగిపోతాయని స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున తిరగబడ్డారు. తవ్వకాలను అడ్డుకుని నిరసనలు తెలిపినా ఫలితం లేకుండా పోయింది. స్థానిక ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలను సైతం బేఖాతరు చేస్తూ, సదరు ఇసుక అసురులు ఈ అక్రమ వ్యవహారంలో క్షేత్రస్థాయిలో సహకరిస్తున్న తోటపాలెం వీఆర్వో పై చర్యలు తీసుకోవాలని, వెంటనే సస్పెండ్ చేయాలని ఉన్నతాధికారుల నుండి ఆదేశాలు వచ్చాయి. కానీ, ఇసుక మాఫియా రంగంలోకి దిగి రాజకీయ ఒత్తిళ్లతో ఆ సస్పెన్షన్ ఆర్డర్లను సైతం మూలనపడేలా 'మేనేజ్' చేసింది. దీంతో సదరు వీఆర్వో వెనకే ఉండి అక్రమ రవాణాకు పచ్చజెండా ఊపుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అలాగే మైన్స్ శాఖ ఇచ్చిన అఫీషియల్ లిస్ట్‌లో చివరి అంశమైన ముద్దాడపేట స్టాక్ పాయింట్' ను గమనిస్తే అధికారుల అడ్డగోలుతనం బయటపడుతుంది. అక్కడ పర్మిటెడ్ క్వాంటిటీ సున్నాగా చూపించారు. కానీ డిస్పాచ్ క్వాంటిటీ మాత్రం 418 క్యూబిక్ మీటర్లు అని రాశారు. అసలు అనుమతి లేని చోట, నిల్వ శూన్యమైన పాయింట్ నుండి 418 క్యూబిక్ మీటర్ల ఇసుక ఎలా డిస్పాచ్ అయ్యింది? ఎవరి ఖాతాలోకి ఈ ఇసుక వెళ్లింది? మైన్స్ అండ్ జియోలాజి శాఖ ఏ ప్రాతిపదికన ఈ నివేదికలు తయారు చేస్తోంది? ప్రభుత్వానికి కళ్లు కప్పి సాగుతున్న ఈ అక్రమ తవ్వకాలపై ఉన్నతాధికారులు నిద్ర నటిస్తున్నారా అనే అనుమానాలు కలెక్టరేట్ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి.

**Sand Details**

| Sl.No | SSP | SSP type | Permitted Qty | Dispatched Quantity | Balance Qty | Moonsoon Stock 2026-2027 | Balance to be excavated |
|---|---|---|---|---|---|---|---|
| 1 | AMBALLAVALSA - DESILT | De-Siltation | 81000 | 0 | 81000 | 10000 | 71000 |
| 2 | BATTERU DE-SILT | De-Siltation | 95175 | 12335 | 82840 | 60000 | 22840 |
| 3 | BHAGIRADHAPRUAM | De-Siltation | 108000 | 70097 | 37903 | 15000 | 22903 |
| 4 | BURAVALLI - DESILT | De-Siltation | 90000 | 902 | 89098 | 70000 | 19098 |
| 5 | CHENULAVALSA-DESILT | De-Siltation | 97585 | 706 | 96879 | 10000 | 86879 |
| 6 | DUSI | De-Siltation | 111150 | 8274 | 102876 | 60000 | 42876 |
| 7 | GARA BIT-2 | De-Siltation | 101835 | 22194 | 79641 | 75000 | 4641 |
| 8 | KALIVARAM | De-Siltation | 94725 | 6258 | 88467 | 25000 | 63467 |
| 9 | NIMMATHORLADA | De-Siltation | 110000 | 71930 | 38070 | 35000 | 3070 |
| 10 | PURUSOTTHAPURAM-DE-SILT | De-Siltation | 108000 | 100 | 107900 | 48000 | 59900 |
| 11 | THOTAPALEM | De-Siltation | 110250 | 5000 | 105250 | 40000 | 65250 |
| 12 | PARLAM | De-Siltation | 97150 | 0 | 97150 | 25000 | 72150 |
| 13 | MADAPAM - BUTCHIPETA | Semi-Mech | 63900 | 28000 | 35900 | 35000 | 900 |
| 14 | MUDDADAPETA STOCK POINT | Moon Son Stock Point | 0 | 418 | 0 | 22582 | 0 |
| | Total | | 1268770 | 226214 | | 530582 | 534974 |

### ఎమ్మెల్యేలకే లేని సమాచారం..

### రాష్ట్ర మంత్రి పేరుతో హల్చల్!

ఈ దందా వెనుక రాష్ట్ర భూగర్భ గనుల శాఖ మంత్రి పేరు చెప్పుకుని కొందరు చలామణి అవుతున్నారు. నదికి ఇరువైపులా ఉన్న ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావుకు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌కు కనీసం సమాచారం కూడా లేకుండా ఈ తవ్వకాలు కొనసాగుతున్నాయి. మైన్స్ డీడీ మోహనరావుకు దీనిపై వివరణ అడుగుదామని ఫోన్ చేస్తే ఆయన ఫోన్ ఎత్తకుండా తప్పించుకుంటున్నారు. కలెక్టర్ క్యాంప్ ఆఫీస్ వెనుకే సాగుతున్న ఈ ఘోర కలకలంపై జిల్లా కలెక్టర్ ఎలాంటి కఠిన నిర్ణయం తీసుకుంటారో, నిబంధనలు ఉల్లంఘించిన మైన్స్ అధికారులపై ఎలాంటి చర్యలు ఉంటాయో వేచి చూడాలి.





జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# నీట్‌లో మెరిసిన కిల్లోయి

**- ఆ గ్రామం నుంచి ఇద్దరికి మెరుగైన ర్యాంకులు**

**- ఇద్దరూ అన్నాచెల్లెలు కావడం విశేషం**





**మందస, జులై 17(వార్త):** నీట్ లో సీట్ సాధించడం అంత ఈజీ కాదు.. ఎంతో కష్టపడిన ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థులు నీట్ లో సీట్లు సాధించి, మంచి ప్రతిభ కనబరిచారు. మందస మండలంలోని కిల్లోయి గ్రామానికి చెందిన ఈ ఇద్దరు విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచడంతో గ్రామంలో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కిల్లోయి గ్రామానికి చెందిన నల్ల జస్వంత్, నల్ల తనూశ్రీ ఇద్దరూ నల్ల గోవిందరాజు, నల్ల నాగేశ్వరరావు అనే అన్నదమ్ముల పిల్లలు. గోవిందరాజు, నాగేశ్వరరావులు స్వయానా సోదరులు. గోవిందరాజు, సంధ్యారాణి కుమార్తె తనూశ్రీ, నాగేశ్వరరావు, మీనాక్షి కుమారుడు జస్వంత్ జాతీయస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి మంచి ర్యాంకులు సాధించారు. మొదటి ప్రయత్నం లోనే నల్ల తనుశ్రీ 601 మార్కులతో జాతీయ స్థాయిలో జెనరల్ కేటగిరీ లో4007వ ర్యాంక్, ఓపెన్ ఎయిర్ 9581వ ర్యాంక్ జస్వంత్ జనరల్ కేటగిరీలో 2402వ ర్యాంక్, ఓపెన్ కేటగిరిలో 5340వ ర్యాంక్ రావడం మా కిల్లోయి గ్రామానికి గర్వకారణం వీరిద్దరిదీ కిల్లోయి కావడం విశేషం. ఇద్దరు అన్నాచెల్లెలు ఒకేసారి ఎంట్రన్స్ పరీక్షలో మంచి ర్యాంకులు సాధించడంతో గ్రామస్తులు, జస్వంత్, తనూశ్రీలను అభినందించారు. కాగా, పంచాయతీ మాజీ సర్పంచ్ కుమార్ చంద్ర మజ్జి, ఉపాధ్యాయులు, మేథావులు, గ్రామపెద్దలైన నౌగాపు నాగేశ్వరరావు, కంసు అనంత్, నల్ల బాలక్రిష్ణ, నాగేశ్వర పూర్ణచంద్ర, నాగేశ్వర బ్రిందావన్, మజ్జి చిత్రసేను, సతీష్ కుమార్, కంసు రాజేశ్, మూలి ప్రతాప్ విద్యార్థుల ప్రతిభను కొనియాడారు. గోవిందరాజు, సంధ్యారాణి కుమార్తె తనూశ్రీ, నాగేశ్వరరావు, మీనాక్షి కుమారుడు జస్వంత్ లను ప్రత్యేకంగా అభినందించారు. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ మాజీ మున్సిపల్ చైర్మన్ కోత పూర్ణచంద్రరావు ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారని విద్యార్థుల తల్లిదండ్రులు చెప్పారు.

## రాజకీయ కక్షతోనే అప్పలరాజు కుమారుడిపై కేసు

**- చింతాడ రవికుమార్**




**ఆమదాలవలస, జులై 17(వార్త):** అప్పలరాజు కుమారుడిపై కేసు రాజకీయ కక్షతోనే నమోదు చేశారని ఆమదాలవలస వైసీపీ ఇన్‌చార్జ్ చింతాడ రవికుమార్ ఆరోపించారు. శుక్రవారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. గొర్రెల కాపరికి జరిగిన ప్రమాదాన్ని ఉద్దేశపూర్వకంగా అప్పలరాజు కుమారుడితో ముడిపెట్టి, లేనిపోని సెక్షన్లు నమోదు చేసి రిమాండ్‌కు పంపించడం అన్యాయమని ఆయన విమర్శించారు. ఏవైనా రాజకీయ విభేదాలు ఉంటే మాజీ మంత్రి అప్పలరాజుతోనే తేల్చుకోవాలని, 18 ఏళ్ల యువకుడి భవిష్యత్తును దెబ్బతీసేలా వ్యవహరించడం న్యాయం కాదని అన్నారు. ఈ సందర్భంగా ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ చేసిన వ్యాఖ్యలపై కూడా చింతాడ రవికుమార్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రాజకీయ కక్షలను పిల్లలపై చూపడం సరికాదని, నాయకుల మధ్య ఉన్న విభేదాలను యువతపై మోపడం తగదని పేర్కొన్నారు. అలాగే, కూన రవికుమార్ ఇతర ఘటనలపై కూడా స్పందించాలని ప్రశ్నించారు.

## అభిశ్రీకి షైనింగ్ స్టార్ అవార్డు




**పలాస, జులై 17 (వార్త):** పదవ తరగతి ఫలితాలలో కమలాపురంలో ఉన్న ఎస్ఎఫ్ఎస్ పాఠశాల చదివి జిల్లా స్థాయిలో మంచి ప్రతిభ కనబరిచినందుకు మన 10వ తరగతి విద్యార్థిని జి.అభిశ్రీని షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ నెల 22న అభిశ్రీని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దిన్ కర్ పుండ్కర్ సన్మానిస్తూ ఒక సర్టిఫికెట్ షీల్డ్, 25 వేల రూపాయలు ప్రైజ్ మనీ అందజేస్తారని ప్రిన్సిపల్ హేమ సుందర్ తెలిపారు. విద్యారంగంలో విశిష్ట ప్రతిభ కనబరిచి, అద్భుత విజయాలతో అందరి ప్రశంసలు పొందిన జి.అభి శ్రీకి షైనింగ్ స్టార్ అవార్డు లభించడం పట్ల పలువురు అభినందనలు తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహించే లక్ష్యంతో చేపట్టిన ఈ పురస్కార కార్యక్రమంలో, ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సన్మానిస్తూ ప్రోత్సాహకాన్ని అందిస్తోందని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ అవార్డు ద్వారా అభి శ్రీ కృషి, పట్టుదల, నిరంతర అభ్యాసానికి గుర్తింపు లభించిందని నువ్వు పేర్కొన్నారు. ఈ విజయం వెనుక కుటుంబం, ఉపాధ్యాయులు, మార్గదర్శకుల సహకారం ఎంతో ఉందని పేర్కొన్నారు. అభి శ్రీ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి, సమాజానికి, విద్యారంగానికి ఆదర్శంగా నిలవాలని శుభాకాంక్షలు తెలియజేశారు. అభి శ్రీ సాధించిన ఈ గౌరవం ఇతర విద్యార్థులకు కూడా స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని, క్రమశిక్షణ, కృషి, లక్ష్యసాధనతో ఏదైనా సాధ్యమని ఈ పురస్కారం మరోసారి చాటిచెప్పిందని నిర్వాహకులు తెలిపారు. మీ అందరి సహకార అభిమానాలతో ఇంకా ఇలాంటి విజయాలు రాబోయే కాలంలో మా ఉపాధ్యాయ బృందం అందరమూ కలిసికట్టుగా పనిచేసి సాధిస్తామని ప్రిన్సిపాల్ బి హేమ సుందర్ మీ అందరికీ విజ్ఞప్తి చేశారు.

## ఆర్థిక లావాదేవీల్లో పారదర్శకత పాటించాలి



**ఇచ్ఛాపురం, జులై 17 (వార్త):** అర్బన్ –మెప్మా విభాగం ఆధ్వర్యంలోఎం డి ఎం ఎల్ (మన డబ్బులు –మన లెక్కలు ) ఇచ్ఛాపురం పురపాలక సంఘము పరిధిలో నిర్వహించారు.మెప్మా విభాగం నందు అర్ పి లు అందరికీ “మన డబ్బులు –మన లెక్కలు” పైన శిక్షణా కార్యక్రమము నిర్వహించారు.మన డబ్బులు –మన లెక్కలు విధానంతో సంఘ సభ్యుల ఆర్థిక కార్యకలాపాలలో పారదర్శకతకు మెప్మా చర్యలు చేపడుతుందని కమీషనర్ ఎన్. రమేష్ తెలియజేసారు. అలాగే ప్రతి నెల సక్రంగా సంఘము మీటింగ్ నిర్వహించి మొబైల్ బుక్ కీపింగ్ చేయాలన్నారు.స్లం స్థాయి మీటింగ్స్ నిర్వహించి ప్రతి సభ్యురాలకు మన డబ్బులు –మన లెక్కలు పైన క్షేత్ర స్థాయిలో అవగాహనా కల్పించాలని తెలియజేసారు.తొలి దశగా 30% సంఘాలు (243) సంఘాల ఆర్థిక స్థితిని క్షేత్ర స్థాయిలో విశదంగా పరిశీలించడానికి, తదుపరి లోపాలను సమీక్షించి పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించందని అన్నారు. ఈ కార్యక్రమం లో సాంకేతిక నిపుణులు రాము, మేనేజర్ బోర భాస్కరరావు, మాస్టర్ డి ఆర్ పి జ్ఞానేశ్వర్, సి వో లు బాలరాజు, సంతోష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఆముదాలవలసలో ప్రజా దర్బార్



**ఆమదాలవలస, జులై 17(వార్త):** ఆముదాలవలస పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే, రాష్ట్ర పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ వ్యక్తిగత, ప్రజా సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చి వినతిపత్రాలు అందజేశారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విన్న ఎమ్మెల్యే కూన రవికుమార్, సంబంధిత శాఖల అధికారులతో వెంటనే మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాగునీరు, పారిశుధ్యం, రోడ్లు, విద్యుత్, పింఛన్లు, గృహ నిర్మాణం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజా దర్బార్ ద్వారా నేరుగా ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుని త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రతి వినతిపై బాధ్యతాయుతంగా స్పందించి ప్రజలకు న్యాయం జరిగేలా అధికార యంత్రాంగం పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు.

## పల్లె పల్లెకు సూపర్ నారీ యాప్ ర్యాలీలు




**మందస, జులై 17(వార్త):** స్వయం సహాయక సంఘాల ఆర్థిక పరిస్థితి, సభ్యురాలు వారీ పొదుపులు, అప్పులు, లెక్కలు తెలియజేసే సూపర్ నారీ యాప్ పై మందస మండలంలో పల్లె పల్లెకు వెలుగు సిబ్బంది వెళ్లి ర్యాలీలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నట్లు వెలుగు గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. మండల కేంద్రమైన మందసతో పాటు అంబుగాం, సువర్ణపురం, పిడిమందస, సాబకోట, హరిపురం, సిరిపురం గ్రామాల్లో మహిళా సంఘ సభ్యులకు పుస్తక నిర్వహణ అవశ్యకతతో పాటు తీసుకున్న రుణాలతో ఎంటర్ ప్రైనర్ గా తయారు కావాలనే ఉద్దేశంతో వివిధ జీవనోపాదులు పై అవగాహన కల్పించడమైనది. హాజరైన మహిళలతో పల్లెలలో వీధి వీధికి కూడా సమాచారం తెలిసేటట్లు సూపర్ నారీ యాప్ డౌన్ లోడ్ చేయిస్తూ మన డబ్బులు మన లెక్కలు ర్యాలీలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మందస మండల సమాఖ్య కోశాధికారి చిన్నబరంపురం గ్రామ సంఘం అధ్యక్షురాలు మెట్ట శారదమ్మ, వి.ఓ.ఏ.నాగమణి తో పాటు గ్రామసంఘాల ప్రతినిధులు, వెలుగు సిబ్బంది , క్లస్టర్ కోఆర్డినేటర్ బాలకృష్ణ, ఈ నారీ సిఆర్పిలు, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రత్యేక అవసరాల పిల్లలకు సహాయక పరికరాల పంపిణీ

**- వీల్‌చైర్లు, వినికిడి యంత్రాలు, ఎంఆర్ కిట్లు అందజేత**

**- పిల్లల దైనందిన జీవనంలో ఉపయోగపడేలా చర్యలు**

**జలుమూరు, జులై 17 (వార్త):** జలుమూరులోని ప్రత్యేక అవసరాల పిల్లల కేంద్రంలో విద్యార్థులకు అవసరమైన సహాయక పరికరాలను శుక్రవారం పంపిణీ చేసినట్లు జలుమూరు మోడల్ ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇప్పిలి మాధవరావు, ఉపాధ్యాయుడు మెండ రామారావు తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక అవసరాలు ఉన్న ఎనిమిది మంది చిన్నారులకు వీల్‌చైర్లు, ఇద్దరు విద్యార్థులకు వినికిడి యంత్రాలు, మరో విద్యార్థికి ఎం.ఆర్. కిట్‌ను వారి తల్లిదండ్రులకు అందజేశారు. పిల్లల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అందిస్తున్న సహాయక పరికరాలు వారి దైనందిన జీవనం, విద్యాభ్యాసానికి ఎంతో ఉపయోగపడతాయని ఉపాధ్యాయులు తెలిపారు. ప్రత్యేక అవసరాల పిల్లలను సమాజంలో ఆత్మవిశ్వాసంతో ముందుకు నడిపించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. తల్లిదండ్రులు కూడా ఈ సహాయక పరికరాలను సద్వినియోగం చేసుకుని పిల్లల అభివృద్ధికి సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అవసరాల పిల్లల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



## 20 నుంచి పలాసలో అమరావతి కప్ నియోజకవర్గ స్థాయి పోటీలు

**పలాస, జులై 17 (వార్త)::** రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న అమరావతి కప్ క్రీడా పోటీలు నియోజకవర్గ స్థాయిలో ఈనెల 20, 21, 22 తేదీల్లో పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించనున్నట్లు కప్ నియోజకవర్గ ఇన్చార్జి చెల్లూరి పద్మలోచనం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు రెండు విభాగాలుగా 17ఏళ్ల లోపు పాఠశాల విద్యార్థులకు, 23ఏళ్ళ లోపు కళాశాల విద్యార్థులకు ఉంటాయన్నారు. విలువిద్య, అథ్లెటిక్స్, బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్, యోగ, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాస్కెట్ బాల్, చెస్, హాకీ, బ్యాడ్మింటన్ అంశాల్లో పోటీలు నిర్వహించనున్నామని, ఒక క్రీడాకారుడు ఒక అంశంలో మాత్రమే పాల్గోవాలన్నారు. ఆసక్తి గలవారు విద్యాసంస్థల ధృవీకరణ, ఆధార్, పదోతరగతి మార్కుల జాబితాతో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. కబడ్డీ క్రీడకు సంబంధించి 17ఏళ్ల లోపు విభాగంలో బాలికలు 65 కేజీలు, బాలురు 70 కేజీలు లోపు ఉండాలని, 23 ఏళ్ల విభాగంలో బాలికలు 70 కేజీలు, బాలురు 80 కేజీలు లోపు ఉండాలన్నారు. మిగిలిన క్రీడల్లో పాల్గోవలసిన వారి వయసు, బరువు తదితర వివరాలకు 9492419416 చరవాణిని సంప్రదించాలని పద్మలోచనం కోరారు. ఇందులో ఎంపికైన వారు ఆగస్టులో నిర్వహించనున్న జిల్లా స్థాయి పోటీలకు అర్హులన్నారు.

## దివ్యాంగులకు ప్రత్యేక గ్రీవెన్స్ స్వాభిమాన్



**మందస, జులై 17(వార్త):** శ్రీకాకుళం జిల్లాలో గల దివ్యాంగులకు ప్రతీ నెల మూడవ శుక్షవారం దివ్యాంగులకు ప్రత్యేక గ్రీవెన్స్(స్వాభిమాన్) నిర్వహించబడుతుందని మదర్ వలంటీర్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లారెడ్డి భాస్కరరావు చెప్పారు. విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధులు సంక్షేమ శాఖ, శ్రీకాకుళం ఆధ్వర్యంలో శ్రీకాకుళంలోని గ్రీవెన్స్ పీఎంఈ సమావేశం మందిరం, కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక గ్రీవెన్స్(స్వాభిమాన్) జరుగుతుందన్నారు. దీనిలో భాగంగా ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు వినతులు స్వీకరించడం జరుగుతుందన్నారు. దివ్యాంగులందరూ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని భాస్కరరావు కోరారు.

## షైనింగ్ స్టార్ అవార్డుకు నిత్యశ్రీ ఎంపిక

**-10వ తరగతిలో 561 మార్కులతో ప్రతిభ చాటిన జమినివలస విద్యార్థిని**

**- సివిల్ ఇంజినీర్‌గా స్థిరపడడమే లక్ష్యమంటున్న నిత్యశ్రీ**



**జలుమూరు, జులై 17 (వార్త):** జలుమూరు మండలం జమినివలస గ్రామానికి చెందిన లంబ నిత్యశ్రీ ఎస్టీ విభాగంలో ప్రతిష్ఠాత్మక షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపికైంది. పదో తరగతి పరీక్షల్లో 561 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచిన ఆమె ఈ అవార్డుకు ఎంపిక కావడం పట్ల గ్రామస్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం నిత్యశ్రీ కరవంజ ఏపీ మోడల్ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం ఇంటర్మీడియట్ చదువుతోంది. విద్యతో పాటు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కృషి చేస్తున్న ఆమె భవిష్యత్తులో సివిల్ ఇంజినీర్‌గా స్థిరపడాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శివకుమార్ నిత్యశ్రీని అభినందిస్తూ, క్రమశిక్షణతో చదువుకుంటూ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఆమె సాధించిన విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థిని ప్రతిభతో రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందడం అభినందనీయమని పలువురు అభిప్రాయపడ్డారు. కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో నిత్యశ్రీ ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు.

## గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం



**పలాస, జులై 17 (వార్త):** పూండి--నౌపడ రైల్వే స్టేషన్ల మధ్య గల వల్లభరావుపేట సమీపంలోని రైల్వే పట్టాల వద్ద గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైన ఘటన కలకలం రేపింది. పలాస ప్రభుత్వ రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలోని పూండి--నౌపడ రైల్వే స్టేషన్ల మధ్య, మార్గంలోని రైల్వే పట్టాలపై సుమారు యాభై ఐదు నుంచి అరవై సంవత్సరాల వయస్సు గల గుర్తుతెలియని మహిళ మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. మృతురాలు చామనఛాయ రంగుత, నెరిసిన జుట్టుతో ఉందని, ఆమె కుడి ముంజేతిపై ఒడియా లిపిలో “శ్రీ రామ్” అని పచ్చబొట్టు ఉందని జి ఆర్ పి ఎఫ్ పోలీసు తెలిపారు. మృతిచెందిన సమయంలో నీలం, తెలుపు, నలుపు రంగుల అడ్డచారలతో కూడిన కాలరు ఉన్న చొక్కాపై నలుపు రంగు జాకెట్ ధరించి ఉందని, మెడలో నలుపు, గోధుమ రంగుల పూసల దండలు ఉండగా, కుడి చేతి మణికట్టుకు నలుపు, తెలుపు రంగుల దారంతో పాటు ఆకుపచ్చ రంగు రిబ్బన్ కట్టబడి ఉందని, ముఖంపై గాయాలు ఉండటంతో పాటు, ఆమె మానసిక స్థితి సరిగా లేని యాచకురాలై ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఆనవాళ్ల ఆధారంగా మృతురాలిని గుర్తించిన వారు, ఆమె బంధువుల వివరాలు తెలిసిన వారు ఎవరైనా ఉంటే వెంటనే పలాస ప్రభుత్వ రైల్వే పోలీసు స్టేషన్ అధికారులైన రైల్వే పోలీసు ఉప పరిశీలకుడు డి. శ్రీనివాసరావు, రైల్వే పోలీసు హెడ్ కానిస్టేబుల్ మెట్ట సోమేశ్వరరావును 9492250069 నెంబర్ కు సంప్రదించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# ముఖ్యమంత్రి సహాయనిధితో పేదలకు ఆర్థిక సాయం

## - సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేసిన ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, బగ్గు అర్చన

## - నిరుపేదల వైద్యానికి కూటమి ప్రభుత్వం అండ

**పోలాకి, జులై 17 (వార్త):** నిరుపేదల వైద్య చికిత్సలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక భరోసా కల్పించడంలో కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. శుక్రవారం పోలాకి మండలం కత్తిరివానిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జలుమూరు మండలం రావిపాడు గ్రామానికి చెందిన సాధు అప్పలనాయుడుకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన రూ.1,54,684 చెక్కును ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి బగ్గు అర్చన అందజేశారు. సాధు అప్పలనాయుడు అనారోగ్యంతో బాధపడుతూ వైద్య చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా రూ.1,54,684 మంజూరైంది. ఈ చెక్కును బాధితుడికి అందజేసి ఆయన త్వరగా కోలుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ, పేద కుటుంబాలు వైద్య ఖర్చులతో ఇబ్బందులు పడకుండా ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలకు అవసరమైన ప్రతి సందర్భంలో ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి ధర్మాన తేజ్ కుమార్, పర్లాం వంశధార డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కింజరాపు సత్యనారాయణ, ఎంపీటీసీ ప్రతినిధి గుండ రామకృష్ణ, మాజీ సర్పంచ్ బత్తుల రాజు, గొల్లంగి సత్యనారాయణ, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులుపాల్గొన్నారు.



## శిథిలావస్థలో పెద్దగుజ్జువాడ పాఠశాల భవనం

### - భయాందోళనలో విద్యార్థులు.

### -కొత్త భవనం నిర్మించాలని గ్రామస్థుల విజ్ఞప్తి



**సారవకోట, జూలై 16 (వార్త):** సారవకోట మండలం పెద్దగుజ్జువాడ ప్రభుత్వ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థులు భయాందోళనల మధ్య విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారు. దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ భవనం కాలగర్భంలో శిథిలమై, ప్రస్తుతం ప్రమాదకర స్థితికి చేరిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల భవనం పైకప్పు పెచ్చులు ఊడిపోతుండగా, గోడలు పలుచోట్ల పగుళ్లు ఏర్పడి ఎప్పుడైనా కూలిపోయే పరిస్థితి నెలకొంది. తరగతి గదుల్లో విద్యార్థులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని చదువుకోవాల్సి వస్తోందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోందని, చిన్నారుల భద్రత దృష్ట్యా వెంటనే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని గ్రామస్థులు కోరుతున్నారు. అధికారులు పలుమార్లు పరిశీలించినప్పటికీ ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం చూపలేదని వారు వాపోతున్నారు. విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ శిథిలావస్థలో ఉన్న భవనాన్ని తొలగించి, ఆధునిక సౌకర్యాలతో కూడిన నూతన పాఠశాల భవనాన్ని వెంటనే మంజూరు చేయాలని గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అలాగే కొత్త భవనం నిర్మాణం పూర్తయ్యే వరకు ప్రత్యామ్నాయ భవనంలో తరగతులు నిర్వహించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డు

### - ఈదులవలస పాఠశాల విద్యార్థులకు జిల్లా స్థాయి గుర్తింపు

### - ఆరుగురు విద్యార్థుల ఎంపిక



**పోలాకి, జులై 17 (వార్త):** పోలాకి మండలం ఈదులవలసలోని ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ప్రతిష్ఠాత్మక షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ శుక్రవారం తెలిపారు. పదో తరగతి విద్యార్థిని కె. కరిష్మా, ఇంటర్మీడియట్ విద్యార్థిని కె. దేవి నక్షత్ర ఈ అవార్డుకు ఎంపికయ్యారని ఆయన వెల్లడించారు. ఎంపికైన విద్యార్థులకు ఈ నెల 20వ తేదీన జిల్లా కేంద్రంలో నిర్వహించే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా రూ.20 వేల నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. విద్యార్థులు విద్యా రంగంలో ప్రతిభ కనబరిచి ఈ గుర్తింపు పొందడం పాఠశాలకు గర్వకారణమని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. వారి విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు అభినందనలు తెలియజేశారు. మండలం నుంచి మొత్తం ఆరుగురు విద్యార్థులు షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపిక కావడం విశేషమని, ఇది స్థానిక విద్యార్థుల ప్రతిభకు నిదర్శనమని ఆయన అన్నారు. భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఎంపికైన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం రావాలి

### - చింతువానిపేట ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో

### - విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచన

**నరసన్నపేట, జులై 17 (వార్త):** నరసన్నపేట మండల విద్యాశాఖ అధికారి ఉప్పాడ శాంతారావు శుక్రవారం చింతువానిపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. తరగతి గదులను సందర్శించిన ఆయన విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి చదవడం, రాయడం నైపుణ్యాలను పరీక్షించారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం తప్పనిసరిగా వచ్చేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల అభ్యసన స్థాయిని ఎప్పటికప్పుడు అంచనా వేసి అవసరమైన బోధన అందించాలని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందనే విశ్వాసం తల్లిదండ్రుల్లో పెంపొందేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని పేర్కొన్నారు. విద్యతో పాటు క్రమశిక్షణ, పరిశుభ్రతకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పాఠశాల ప్రాంగణం, తరగతి గదులు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు ఆహ్లాదకరమైన విద్యా వాతావరణాన్ని కల్పించాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు. పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపే ప్రభుత్వ లక్ష్యమని, అందుకు ఉపాధ్యాయులు సమిష్టిగా కృషి చేయాలని మండల విద్యాశాఖ అధికారి ఉప్పాడ శాంతారావు సూచించారు.



## ఇరిగేషన్ ప్రాజెక్టుల ఆలస్యంపై కూన ఆగ్రహం



**ఆమదాలవలస, జులై 17(వార్త):** శ్రీకాకుళం జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆముదాలవలస ఎమ్మెల్యే, రాష్ట్ర పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ పాల్గొన్నారు. సమావేశంలో జిల్లా అభివృద్ధి, గ్రామీణ మౌలిక వసతులు, సాగునీటి ప్రాజెక్టులు, వ్యవసాయం, రహదారులు, సంక్షేమ పథకాల అమలుపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆముదాలవలస నియోజకవర్గానికి సంబంధించిన పలు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చిన ఎమ్మెల్యే, ఇరిగేషన్ ప్రాజెక్టుల పనులు ఆలస్యమవడానికి ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యమే ప్రధాన కారణమని పేర్కొన్నారు. పెండింగ్ పనులను వేగవంతం చేసి రైతులకు సాగునీరు సకాలంలో అందేలా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు సకాలంలో చేరేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించిన ఎమ్మెల్యే, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన, తాగునీటి సమస్యల పరిష్కారం, విద్యా, వైద్య సేవల బలోపేతానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. సమావేశంలో జడ్పీ చైర్మన్ పిరియా విజయ, జడ్పీ సీఈవో, జిల్లా ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేయాలి

### - లింగాలవలస జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించిన ఎంఈవో మాధవరావు

### - మౌలిక వసతులు, మధ్యాహ్న భోజన పథకంపై సమీక్ష

**జలుమూరు, జులై 17 (వార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని మండల విద్యాశాఖ అధికారి (ఎంఈవో) బమ్మిడి మాధవరావు సూచించారు. శుక్రవారం జలుమూరు మండలం లింగాలవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించి పాఠశాలలోని మౌలిక వసతులు, విద్యా బోధన, నిర్వహణ అంశాలను పరిశీలించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించే దిశగా పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించిన ఎంఈవో, విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పాఠశాల సిబ్బందిని ఆదేశించారు. పాఠశాల పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం, ఇతర మౌలిక వసతుల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో విద్యార్థుల విద్యా ప్రగతి, బోధన విధానాలు, పాఠశాల అభివృద్ధి అంశాలపై చర్చించారు. విద్యా ప్రమాణాల పెంపుతో పాటు పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు కార్యాచరణ రూపొందించాలని సూచించారు. పాఠశాల నిర్వహణలో లేదా విద్యా బోధనలో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎంఈవో బమ్మిడి మాధవరావు తెలిపారు.

## హెల్మెట్ ధరించి ప్రాణాలను రక్షించుకోండి

### - విద్యార్థులకు రహదారి భద్రతపై పోలీసుల అవగాహన

### - మైనర్లు వాహనాలు నడపవద్దని సూచన

**సారవకోట, జులై 17 (వార్త):** హెల్మెట్ ధరించడం ద్వారా ప్రమాదాల సమయంలో ప్రాణాలను కాపాడుకోవచ్చని, ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్‌ను వినియోగించాలని టెక్కలి శక్తి టీమ్--4కు చెందిన హెడ్ కానిస్టేబుళ్లు ఎం. గిరిధర్, భీమారావు సూచించారు. శుక్రవారం సారవకోట మండలం అనుపురంలోని ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన రహదారి భద్రత అవగాహన కార్యక్రమంలో వారు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. రోడ్డు భద్రతా నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. మైనర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు నడపరాదని, చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ద్విచక్ర వాహనాలను నడపడం చట్టవిరుద్ధమని వివరించారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. మహిళలు, బాలల భద్రతకు పోలీసులు ఎల్లప్పుడూ అండగా ఉంటారని, ఎలాంటి సమస్య ఎదురైనా నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని సూచించారు. విద్యార్థులు తమ కుటుంబ సభ్యులకు కూడా రహదారి భద్రతపై అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## అయ్యప్ప స్వామి దేవాలయంలో ఘనంగా కర్కాటక సంక్రమణ పూజలు



**ఇచ్ఛాపురం, జులై 17 (వార్త):** కర్కాటక సంక్రమణం పర్వదినాన్ని పురస్కరించుకుని, స్థానిక అయ్యప్ప స్వామి పంచాయతన దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఆశీ క్రిష్ణ గురుస్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్వామి వారికి అష్టాభిషేకములు విశేష పూజలు నిర్వహించారు. ఈ పవిత్రమైన రోజున లోపింటి శ్రీనివాసరావు, లోపింటి సరోజిని దంపతులు కుమారుడు పునీత్ కుమార్, కుమార్తె రోషిని దేవాలయాన్ని సందర్శించి, స్వామి వారికి అష్టాభిషేకములు, ప్రత్యేక పూజలు విశేష హారతులు నిర్వహించి తమ భక్తిని చాటుకున్నారు. ఈ వేడుకలో పాల్గొన్న కుటుంబ సభ్యులందరికీ, కమిటీ సభ్యులకు స్వామి ఆశీస్సులు లభించాలని ఆలయధర్మకర్త పద్మావతి పట్నాయక్ ఆకాంక్షించారు.

## చిన్నారికి ఆర్థికసాయం



**ఇచ్ఛాపురం, జులై 17(వార్త):** తేలుకుంచికి చెందిన ఎనిమిదేళ్ల చిన్నారి విశాఖ పట్నం ప్రైవేట్ ఆసుపత్రిలో అనారోగ్యం తో చికిత్స పొందుతుంది. యువ భారత్ సేవా ఫౌండేషన్ సభ్యులు 8500 రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. విశాఖ పట్నం సభ్యులు వీటిని అందజేశారు.

## ఖాళీగా ఉన్న 20వేల ఎస్సై, కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేయాలి

### - జీవో నెంబర్ 46ను రద్దు చేయాలి



**మందస/శ్రీకాకుళం, జులై 17(వార్త):** అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో ఖాళీగా ఉన్న ఎస్సై కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేయాలని జ్యోతిబాయ్ పూలే పార్క్ నుండి కలెక్టరేట్ వరకు ర్యాలీ ధర్నా నిర్వహించారు అనంతరం జాయింట్ కలెక్టర్ అహ్మద్ ఖాన్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు సోమశేఖర్, సిహెచ్ రవి ,అభ్యర్థి సాయి మాట్లాడుతూ.. అసెంబ్లీ సాక్షిగా రాష్ట్ర హోం శాఖ మంత్రి అనిత 20 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయి వాటిని భర్తీ చేస్తామా నా హామీ ఇచ్చి నేడు 2388 పోస్టులు తో నోటిఫికేషన్ విడుదల చేయడం సరికాదన్నారు. 2388 పోస్టులకు దాదాపు పది లక్షలు పైచిలుకు పోటీ పడుతున్నారన్నారు. జీవో నెంబర్ 46 ను రద్దు చేసి ఓపెన్ కేటగిరి 5% నుండి 30% కి పెంచాలని డిమాండ్ చేశారు. పోలీస్ అభ్యర్థులు వేలకు వేలు ఫీజులు కట్టుకుంటూ 4 సంవత్సరాలుగా కోచింగ్ సెంటర్లో కోచింగ్ తీసుకుంటున్న అభ్యర్థుల ఆశలు ఆవిరి అయిపోతున్నాయని అన్నారు. అభ్యర్థుల వయోపరిమితి 35 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనకు శ్రీకారం చుడతం అని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో నిర్మల, జ్యోతి, శ్యామల, రమ్య, ఇందు వాసంతి, సాయి, వెంకీ, ముని, శ్రీను పాల్గొన్నారు.

## జడ్పీ పాఠశాల విద్యార్థికి షైనింగ్ స్టార్ అవార్డు

### - 10వ తరగతిలో నియోజకవర్గ టాపర్‌గా నిలిచిన చింతు యశ్వంత్‌కు అరుదైన గుర్తింపు

### - విద్యార్థిని అభినందించిన ఉపాధ్యాయులు

**జలుమూరు, జులై 17 (వార్త):** జలుమూరు మండలం యలమంచిలి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన మాజీ విద్యార్థి చింతు యశ్వంత్‌కు షైనింగ్ స్టార్ అవార్డు లభించినట్లు ప్రధానోపాధ్యాయుడు జి. రఘునాథరావు గురువారం తెలిపారు. ఇటీవల నిర్వహించిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో చింతు యశ్వంత్ 589 మార్కులు సాధించి నరసన్నపేట నియోజకవర్గ స్థాయిలో టాపర్‌గా నిలిచి ఈ అరుదైన గుర్తింపును సొంతం చేసుకున్నాడని ఆయన వెల్లడించారు. ప్రస్తుతం యశ్వంత్ నూజివీడులోని లిట్రిపుల్ ఐటీ (=+ఖఖు)లిలో విద్యను అభ్యసిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థి సాధించిన ఈ విజయంతో యలమంచిలి జడ్పీ పాఠశాలకు మంచి గుర్తింపు లభించిందని ప్రధానోపాధ్యాయుడు పేర్కొన్నారు. ప్రతిభ, కృషి, క్రమశిక్షణతో విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చని ఆయన అన్నారు. షైనింగ్ స్టార్ అవార్డు అందుకున్న చింతు యశ్వంత్‌ను పాఠశాల ఉపాధ్యాయులు అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థి సాధించిన విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని పేర్కొన్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# ప్రజా దర్బార్‌లో వెల్లువెత్తిన వినతులు

**- 44 ప్రధాన అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి**

**- ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు**

**- బగ్గు అర్చన**

**పోలాకి, జులై 17 (వార్త):** ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బగ్గు అర్చన పేర్కొన్నారు. శుక్రవారం పోలాకి మండలం కత్తిరివానిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో వారు ప్రజల నుంచి వినతులను స్వీకరించి సమస్యలను తెలుసుకున్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. మొత్తం 44 ప్రధాన వినతులను స్వీకరించిన ఎమ్మెల్యే, ఒక్కో అర్జీని పరిశీలించి సంబంధిత సమస్యలపై అధికారులతో చర్చించారు. అర్జీలలో ప్రధానంగా సామాజిక భద్రతా పింఛన్లు, గృహ నిర్మాణాలు, ఇళ్ల స్థలాలు, సాగునీటి కాలువల పూడికతీత, దెబ్బతిన్న కాలువల మరమ్మతులు, గ్రామీణ రహదారుల పునర్నిర్మాణం, అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం, గుంతలమయమైన రహదారులకు ప్యాచ్‌వర్క్‌లు, తారు రోడ్ల నిర్మాణం వంటి అంశాలు ప్రాధాన్యంగా ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ, ప్రజా దర్బార్‌లో అందిన ప్రతి వినతిని ప్రాధాన్యతతో పరిశీలిస్తున్నామని చెప్పారు. అత్యవసర సమస్యలపై అక్కడికక్కడే సంబంధిత



శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని, పింఛన్లు, గృహ వసతి వంటి అంశాల్లో పారదర్శకంగా వ్యవహరిస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బగ్గు అర్చన మాట్లాడుతూ, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. గత పాలనలో నిర్లక్ష్యానికి గురైన అభివృద్ధి పనులను మళ్లీ గాడిలో పెట్టేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామని చెప్పారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం దళారులను ఆశ్రయించకుండా నేరుగా ప్రజా దర్బార్ ద్వారా వినతులు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి టీడీపీ నాయకులు, జనసేన, బీజేపీ కూటమి నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## వంట పనికి గుడ్ బై చెప్పిన మహిళలు



**సోంపేట, జులై 17 (వార్త):** సోంపేటలోని బాలికల ఉన్నత పాఠశాలలో చోటుచేసుకున్న ఫుడ్ పాయిజన్ పరిణామాల్లో భాగంగా వంట ఏజెన్సీ మహిళలు మాపై వచ్చిన ఆరోపణలు పూర్తిగా తొలగినంతవరకు విధుల నుంచి దూరముగా ఉంటామని తేల్చి చెప్పారు. ఈ మేరకు టి. భారతి, జి.చిరంజీవిలు, వై. ధనలక్ష్మి, పి. పద్మ తదితరులు స్థానిక ఇన్చార్జి హెచ్ఎం కు గురువారం లేఖ అందజేశారు. ఇది ఇలా ఉండగా పాఠశాలలో డ్రిల్ మేడం వేధింపులు భరించలేమని పేర్కొన్నారు. పాఠశాలలో వందకు పైగా బాలికలు తిన్నటువంటి మధ్యాహ్న భోజనంలో కేవలం 40 మంది మాత్రమే అస్వస్థతకు గురయ్యారని, అలాగే వంటకు ఉపయోగించిన పాత చింతపండు, ఆయిల్ కారణంగా ఫుడ్ పాయిజన్ జరిగిందని నిర్ధారించారని పేర్కొన్నారు. దీనికి మమ్మల్ని బాధ్యుల్ని చేసి ఆరోపణలు చేయడం ఎంతవరకు సమంజసం అని అన్నారు. మా పట్ల నిందలు తొలగేంతవరకు విధులకు హాజరు కామని తేల్చి చెప్పారు.

## జీవనరావు కుటుంబానికి లక్ష్మణ్ పరామర్శ




**మందస, జులై 17(వార్త):** మందస మండలంలోని రాంపురం పంచాయతీ తిమ్మలబిడిమి గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన నాయకుడు తిమ్మల జీవనరావు తండ్రి తిమ్మల దానేసు ఇటీవల హటాత్తుగా మరణించారు. విషయం తెలుసుకున్న డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన యూనివర్సిటీ బోర్డు మాజీ సభ్యుడు బత్తిని లక్ష్మణ్ జీవనరావుకు పరామర్శించారు. దానేసు మృతికి సంతాపం తెలిపారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు. కార్యక్రమంలో బాలిగాం పీఏసీఎస్ మాజీ ఛైర్మన్ సొర్ర డిల్లేశ్వరరావు, పలాస నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఐటివి అధ్యక్షుడు బత్తిని లక్ష్మణ్, నియోజకవర్గ యువజన అధ్యక్షుడు దున్న హరికృష్ణ, సీనియర్ నాయకులు రత్నాల భీమారావు, తడాల అప్పలస్వామి, జుత్తు గణపతి, జుత్తు ధర్మారావు, జుత్తు గున్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## శ్మశానవాటిక శుభ్రం చేయించిన శ్రీనివాస్



**సోంపేట, జులై 17 (వార్త):** పట్టణంలోని శ్రీ కాశీ విశ్వేశ్వర ఆలయ సమీపంలో గల శ్మశాన వాటికలో చెట్లు పిచ్చి మొక్కలు ఇతర చెత్తాచెదారాలను శుక్రవారం స్థానిక మాజీ ఎంపీపీ చిత్రాల శ్రీనివాస్ యంత్ర సహాయంతో శుభ్రం చేయించారు. శ్మశాన వాటికకు వెళ్లే సందర్భాల్లో ప్రజలు ఈ పరిస్థితి గూర్చి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. పరిశుభ్రం చేయడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## రైల్వే ఉద్యోగులకు రిఫరల్‌గా గోపాలకృష్ణ హాస్పిటల్

**సోంపేట, జులై 17 (వార్త):** జిల్లాలో గల రైల్వే ఉద్యోగులకు గోపాలకృష్ణ హాస్పిటల్ రిఫరల్ హాస్పటల్ గా పనిచేస్తుందని వాల్తేరు డివిజన్ ఏడిఆర్ఎం కుందు రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు శుక్రవారం రైల్వే డాక్టర్ అనూష తో కలిసి ముఖ్య సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఈ నిర్ణయం వల్ల ఇకపై పలాసలో వైద్యం చేయించుకునే సౌకర్యంతో దూర భారం తప్పుతుందని పేర్కొన్నారు. పలాస పరిసర ప్రాంతాల్లో గల రైల్వే ఉద్యోగులు ఎలాంటి వైద్య సిఫార్సులు కోసమైనా విశాఖపట్నం వరకు ప్రయాణించాల్సిన అవసరం ఉండదని పేర్కొన్నారు. స్థానికంగా మెరుగైన వైద్యాన్ని పొందే సౌలభ్యం కలుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా ఇటువంటి సౌకర్యానికి విశేషంగా కృషి చేసిన ఏడిఆర్ఎం రామారావుకు రైల్వే ఉద్యోగులు స్థానికులు అభినందనలు తెలిపారు.






## హామీలు సరే.. అమలుపరిచేదెప్పుడు?

**- మెళియాపుట్టి మండల సమావేశంలో సభ్యుల మధ్య వాగ్వాదం**

**మెళియాపుట్టి, జులై 16 (వార్త):** ప్రజలకు హామీలు ఇచ్చారు సరే, ఇచ్చిన హామీలలో కొన్ని నెలలు గడుస్తున్న నేటికిని వాటిని ఇంకా ఎప్పుడు అమలుపరిచేదని! సభ్యులు మండల సర్వసభ్య సమావేశంలో అధికారులను నిలదీశారు. దీంతో రాజకీయ పార్టీల సభ్యుల మధ్య కొంత సమయం వాగ్వాదం జరిగి, సవాల్ ప్రతి సవాల్ చేసుకునే పరిస్థితి వరకు వెళ్లడంతో సభలో కొంత సమయం గందరగోళ పరిస్థితి ఏర్పడింది వివరాల్లోకి వెళితే ఎంపీడీవో నరసింహ ప్రసాద్ పండా నేతృత్వంలో ఎంపీపీ రానా ఈశ్వరమ్మ అధ్యక్షతన శుక్రవారం నాడు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో మెళియాపుట్టి ఎంపీటీసీ ప్రతినిధి పోలాకి జైమినిరావు మాట్లాడుతూ ఇచ్చిన హామీలలో నేటికిని చాలావరకు పరిష్కారం జరగలేదని తెలియజేస్తూనే ఇప్పటికీని చాలావరకు విద్యార్థులకు స్కూల్ బ్యాగులు కూడా అందించలేని, అర్హులైన వారికి కొత్త పెన్షన్లు మంజూరు కాకపోవడంతో గ్రామాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలియజేస్తూనే వివిధ సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ వ్యాఖ్యలతో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకోగా ఈ సందర్భంలో కోసమాల పీఏసీఎస్ అధ్యక్షుడు సలాన మోహనరావు సమావేశంలో జరిగిన వ్యవహారంపై స్పందిస్తూ ప్రజా సమస్యలపై బహిరంగంగా చర్చకు సిద్ధమా?" అంటూ సవాల్ చేయటంతో సమావేశం ఒకసారిగా వేడెక్కింది. రోడ్లు నిర్మాణం, పెన్షన్లు మంజూరు, ఎరువుల కొరతపై తదితర వివిధ ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులను ప్రశ్నించే క్రమంలో సభలో సభ్యుల మధ్య వివిధ అంశాలపై వాగ్వాదం



చోటుచేసుకుంది.

పెద్దపద్మాపురం ఎంపీటీసీ ప్రతినిధి ఊర్లన ఋషి మాట్లాడుతూ క్రితంసారి జరిగిన మండల సమావేశంలో ప్రస్తావించిన అత్యవసర ప్రజా సమస్యలపై ఇప్పటివరకు ఏ శాఖకు సంబంధించిన ఎలాంటి పరిష్కార చర్యలు తీసుకుందో సభకు వివరించాలని, గత సమావేశంలో తీసుకున్న తీర్మానాలు అమలయ్యాయా లేదా అనే అంశంపై స్పష్టత ఇవ్వాలని అధికారులను కోరారు.రైతులు యూరియా, డీఏపీ ఎరువుల కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఒక ఎకరాకు కేవలం 25 కిలోల యూరియానే ఇస్తున్నారని, అవసరమైన ఎరువులు బ్లాక్ మార్కెట్‌లో కూడా దొరకడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తూనే, రైతులకు సకాలంలో సరిపడా ఎరువులు అందించాలని కోరారు. మండల సమావేశంలో ఎంపీడీవో నరసింహ ప్రసాద్ పండా తోపాటు తహసిల్దార్ పాపారావు, ఎంపీపీ ప్రతినిధి ఉదయ్ కుమార్ వివిధ శాఖధికారులు, ప్రజాప్రతినిధులు, పంచాయతీల ప్రత్యేక అధికారులు,ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


## మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



**నరసన్నపేట, జులై 17 (వార్త):** మాదకద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి సూచనల మేరకు ఈగల్ (జూగా+రాజు) టీం సభ్యులు గ్రామస్థులకు అవగాహన కల్పించారు. నరసన్నపేట మండలం రెల్లివలస గ్రామ పంచాయతీలో గురువారం రాత్రి నిర్వహించిన పల్లెబాట కార్యక్రమంలో ఈగల్ టీం సభ్యులు ఉదయ్ కుమార్, రామచంద్రం పాల్గొని మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై గ్రామస్థులకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వ్యసనం వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు కుటుంబ, సామాజిక జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. ముఖ్యంగా యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి పరిస్థితుల్లోనూ మత్తు పదార్థాల జోలికి వెళ్లవద్దని సూచించారు. గ్రామాల్లో ఎవరైనా మాదకద్రవ్యాల విక్రయం లేదా వినియోగానికి పాల్పడుతున్నట్లు తెలిసినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం కీలకమని, ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, యువత మరియు స్థానిక ప్రజలు పాల్గొని మాదకద్రవ్యాల నివారణపై అవగాహన పొందారు.

## సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్షపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలి

**- ప్రగతిశీల మహిళా సంఘం డిమాండ్**




**పలాస, జులై 17 (వార్త):** సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్షపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి పి కుసుమ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 20 రోజులుగా ప్రజాస్వామ్యబద్ధంగా నిరాహార దీక్ష చేస్తున్న సోనమ్ వాంగ్‌చుక్‌ను కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆమె పేర్కొన్నారు. ఆయన లేవనెత్తిన సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి, చర్చలు జరిపి తగిన పరిష్కారం చూపాలని, ప్రజాస్వామ్య పద్ధతిలో జరుగుతున్న నిరసనలను అణచివేయకుండా, వాటిని గౌరవించడం ప్రభుత్వ బాధ్యతని, అందువల్ల సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్షపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని ప్రగతిశీల మహిళా సంఘం ( పిఓడబ్ల్యు) డిమాండ్ చేస్తోందని అన్నారు.

## శారదాపురం పాఠశాలకు ప్రింటర్ వితరణ



**సోంపేట, జులై 17 (వార్త):** శారదాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు క్వాలిటీ ఇంజనీర్ మేనేజింగ్ డైరెక్టర్ ఉలాల హరికృష్ణ 20 వేల రూపాయల విలువైన ప్రింటర్ను పాఠశాలకు వితరణగా అందజేశారు. దీని పట్ల ప్రధానోపాధ్యాయుడు బుస్క ఈశ్వరరావు, ఉపాధ్యాయ సిబ్బంది, ఏఎంసీ చైర్ పర్సన్ ప్రతినిధి మద్యల నాగేశ్వరరావు తదితరులు హర్షం వ్యక్తం చేస్తూ హరికృష్ణకు అభినందనలు తెలిపారు.

## ఒడియా హైస్కూల్‌పై ఇంత నిర్లక్ష్యమా?

**- వైసీపీ సమన్వయకర్త శ్యాం ప్రసాద్ రెడ్డి ఆవేదన**

**కవిటి, జులై 17(వార్త):** సహలాల పుట్టుక గ్రామంలో గల జిల్లా పరిషత్ ఒడియా హైస్కూల్ అసౌకర్యాలకు నిలయంగా మారిందని దీనిపట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందని ఇచ్ఛాపురం నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. వైసిపి రాష్ట్ర బీసీ విభాగం కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్ తో కలిసి శుక్రవారం పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో తీవ్ర సమస్యలను గుర్తించారు. 20 రోజులుగా వాటర్ పంప్ మోటర్ పనిచేయడం లేదని, నీటి సరఫరా లేదని, పిల్లలకు తాగునీటి సదుపాయం లేదని గుర్తించారు. మగ పిల్లలకు టాయిలెట్స్ లేవని, పాఠశాలకు ప్రహరీ గోడ లేదని గుర్తించారు. వంటగది కూడా లేకపోవడం, నాడు నేడు పనులు కొనసాగింపు లేకపోవడం గుర్తించినట్లు పేర్కొన్నారు. నిరుపేద పిల్లలకు దుస్తులు షూ ఇవ్వలేదని పేర్కొన్నారు.

జిల్లా కలెక్టర్ దృష్టికి త్వరలో సమస్యలు తీసుకువెళ్తానని అన్నారు. వీరితోపాటు ఎంపీపీ ప్రతినిధి కడియాల ప్రకాశ, రవి, మురళి, ఆసి పురుషోత్తం, గాంధీ, కృష్ణారెడ్డి, చల్ల దేవరాజు పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546